క్లుప్తంగా

12 నుంచి స్కూల్ గేమ్స్ సెలక్షన్స్

హొళగుంద: ఇంగళదహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 12,13 తేదీల్లో స్కూల్ గేమ్స్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు పీడీ రాందాస్ సోమవారం తెలిపారు. అండర్-14, 17 విభాగాలకు సంబంధించి మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఆటల పోటీల్లో పాల్గొనవచ్చని చెప్పారు. కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయట్, అథ్లెటిక్స్ తదితర పోటీలు నిర్వహిస్తామన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను తాలూకా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని ఆయన వెల్లడించారు. ఆసక్తి గల విద్యార్థులను ఆయా పాఠశాలల పీడీ, పీఈటీలు పోటీల్లో పాలు పంచుకునేలా చూడాలన్నారు. వివరాలకు సెల్ :9533116595 5 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పందుల బెడద తప్పించండి

వెల్దుర్తి: వీధుల్లో విచ్చలవిడిగా తిరుగుతున్న పందుల బెడద తప్పించాలని పట్టణంలోని 14,15వ వార్డు యువకులు సోమవారం గ్రీవెన్స్‌ను ఆశ్రయించారు. ఈ సందర్భంగా తమ వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయరెడ్డి, ఎంపీడీఓ శివమల్లేశ్వరప్పకు అందజేశారు. వారు మాట్లాడుతూ.. పందులు ఇళ్లల్లోకి చొరబడుతున్నాయని, చిన్న పిల్లలు, మహిళలపై దాడులకు పాల్పడుతున్నాయని, రహదారిపై రాకపోకలకు ఇబ్బందులు కలుగజేస్తున్నాయని, పందులు అడ్డువచ్చి పలువురు వాహనదారులుప్రమాదాలకు గురయ్యారన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ మార్పు

మద్దికెర : స్థానిక బస్టాండు సమీపంలో ఓవర్ హెడ్ ట్యాంకుల వద్దనున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చుతున్నట్లు విద్యుత్ ఏఈ రఫీక్ సోమవారం తెలిపారు. పంచాయతీ వారు అభివృద్ధి పనుల్లో భాగంగా డ్రైనేజీ పనులు చేపడుతుండడంతో రోడ్డుకు అడ్డంగా ఉండటంతో విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయని, చాలా ఏళ్లగా మార్చాలని ప్రజలు కోరుతున్నారని, అందువల్ల జిల్లా అధికారులకు తెలియజేసి మార్చుతున్నామని చెప్పారు. జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, ఈఓ శివకుమార్, ఆంజనేయులు, మాజీ ఎంపీపీ మల్లికార్జున ఉన్నారు.

హాస్టల్ తనిఖీ



విద్యార్థినులతో మాట్లాడుతున్న శ్రీనివాసులు

వెల్దుర్తి: స్థానిక బీసీ బాలికల హాస్టల్‌ను కర్నూలు రూరల్ అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాసులు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, సరుకుల స్టాకు, విద్యార్థినుల హాజరు, వసతులు పరిశీలించారు. విద్యార్థినులతో సమావేశమై సౌకర్యాలు, చదువుకుంటున్న తీరుపై ఆరా తీశారు. 2023-24 పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతపై, స్థానిక పూర్వ విద్యార్థుల సహకారంతో హాస్టల్‌లో పలు సౌకర్యాలు కల్పించడంపై హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ శైలజను అభినందించారు.

రైలులో దాడి..దోపిడీ



తీవ్రగాయాలతో గంగన్న

వెల్దుర్తి: రైలులో పల్లీలు అమ్ముకునే వ్యక్తిపై దాడి చేసి దోపిడీ చేశాడో యువకుడు. కర్నూలు రైల్వే స్టేషన్, కోట్ల రైల్వేస్టేషన్ మధ్య రైలులో జరిగిన సంఘటన గురించి బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. వెల్దుర్తికి చెందిన గంగన్న రైలులో పల్లీలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం రాత్రి డెమో ట్రైన్ కర్నూలు నుంచి డోన్ వైపు వెళ్తుండగా వెల్దుర్తికి చేరుకునేందుకు అమ్మిన పల్లీల డబ్బులతో బయలుదేరాడు. గమనించిన కర్నూలుకు చెందిన నీలిషికారి యువకుడు అదే రైలులో అతడిని వెంబడించి ఒక్కసారిగా దాడి చేసి, అతని వద్ద ఉన్న రూ.1500 లాక్కొని కోట్ల రైల్వే స్టేషన్ దాటిన తర్వాత రైలులో నుంచి దూకి పారిపోయాడు. తీవ్రగాయాల పాలైన గంగన్న అదే రైలులో రక్త గాయాలతో వెల్దుర్తి స్టేషన్‌లో దిగి ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు.

పత్తికొండలో ఉద్రిక్తత

పత్తికొండ(తుగ్గలి) : వినాయక నిమజ్జనం సందర్భంగా సోమవారం రాత్రి పత్తికొండ పట్టణంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. తొలుత వినాయకుడిని నిమజ్జనం చేసే విషయంలో రెండు ఉత్సవ కమిటీల మధ్య ప్రారంభమైన గొడవ.. రాళ్లు రువ్వుకునే వరకు వెళ్లింది. దీంతో ఓ పోలీస్‌తో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరు వర్గాలను చెదరగొట్టారు. ఘర్షణ చోటుచేసుకోవడంతో ఎన్నడూ లేనట్లుగా నిమజ్జనం ఆలస్యంగా ప్రారంభమైంది.

చిరుత దాడిలో మేకలు మృతి

కోసిగి: స్థానిక కొండ శివారు ప్రాంతంలో సోమవారం కోసిగికి చెందిన వక్రాని దస్తగిరి గొర్రెల మందులోని రెండు మేకలను చిరుతపులి చంపేసింది. దాదాపు మూడేళ్ల పైగా కోసిగి శివారు ప్రాంతంలో చిరుతల సంచార విపరీతరంగా పెరిగిపోయిందని, రాత్రిల్లో నిద్ర లేక చాల అవస్థలు పడుతున్నామని గొర్రె కాపరులు వాపోయారు. ఇప్పటి వరకు 8కి పైగా గొర్రెలను చంపేసిందని బాధితుడు వాపోయాడు. సంబంధిత ఫారెస్ట్ అధికారులు స్పందించి చిరుతలను బంధించాలని కోరారు.

- వరదపై అధికారుల సూచనలు ఏమయ్యాయి
- వాతావరణ శాఖ హెచ్చరికలను ఎందుకు పాటించలేదు ?
- ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి సూటి ప్రశ్న

ప్రభుత్వ నిర్లక్ష్యమే విజయవాడను ముంచింది



ఆలూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం అల్పపీడనంగా మారడంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ముందే హెచ్చరించడం, ఎగువ నుంచి భారీగా వరద వస్తుందని అధికారులు చెబుతున్నా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం కారణంగానే విజయవాడ వరదలో మునిగిందని, తొమ్మిది రోజులు గడుస్తున్నా నేటికీ తేరుకోలేకపోయిందని ఆలూరు ఎమ్మెల్యే బి. విరూపాక్షి పేర్కొన్నారు. సోమవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ.. విజయవాడ కరకట్ట సమీపంలోని సీఎం చంద్రబాబు నాయుడు ఇల్లు, ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ యాక్టివ్ పవర్ ప్లాంట్ మునిగిపోకుండా కాపాడుకునేందుకు బుడమేరు నుంచి నీటిని వెలగలేరు రెగ్యులేటర్ ద్వారా విజయవాడ మీదకు వదిలేసి 57 మంది మృతికి కారకులయ్యారని ఆరోపించారు. వాతావరణ, నీటిపారుదల శాఖలకు చెందిన అధికారులు ముందస్తు హెచ్చరికలు తెలియజేసినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. ప్రజలను అప్రమత్తం చేసి ప్రమాదకర పరిస్థితుల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రయత్నం చేయక పూర్తిగా వైఫల్యం చెందారని మండిపడ్డారు. లక్షలాది మంది వరద బాధితులకు కనీసం తాగునీరు, ఆహారం, పిల్లకు పాలు చేరవేయలేదన్నారు. ఆకలితోనే చాలా మంది మృతి చెందారని స్థానికులు చెబుతుండటాన్ని చూస్తే ప్రభుత్వ చర్యలు ఏపాటివో తెలుస్తుందన్నారు. కేవలం చంద్రబాబు ప్రచార యావతోనే యంత్రాంగాన్ని గందరగోళానికి గురిచేస్తున్నారని, తాను వరద ప్రాంతాల్లో పర్యటిస్తూ యంత్రాంగాన్ని తన వెంట తిప్పుకుంటుండటంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందన్నారు. ప్రజలు బాధల్లో ఉంటే ప్రచారం చేసుకోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికీ వరద ప్రాంతాల్లోని చాలా మందికి సహాయం అందడం లేదని, వారి పరిస్థితి దుర్భరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.



కృష్ణగిరి:పుట్లూరులో వినాయకుని విగ్రహం వద్ద లడ్డూను వేలం వేస్తున్న దృశ్యం



చెరుకులపాడులో నిమజ్జనానికి తరలిన గణనాథుడు



ఆలూరులో ఊరేగింపుగా నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



హొళగుంద : ఎల్లెల్సీ కాలువలో వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న దృశ్యం



పగిడిరాయి బోడబండ గేరిలో రూ.57,500కు లడ్డును దక్కించుకున్న తిమ్మప్ప

వినాయకా..వీడ్కోలిక

ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో మూడు రోజుల పాటు భక్తుల నుంచి పూజలందుకున్న గణనాథుడు సోమవారం గంగ ఒడికి చేరారు. శనివారం వినాయక చవితి సందర్భంగా లంబోదరుడుని ప్రత్యేక మండపాల్లో ప్రతిష్ఠించి విశేష పూజలు చేశారు. మూడు రోజులు కావడంతో సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు చేపట్టి, భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం తరువాత శోభాయాత్రగా విగ్రహాలను మేళతాళాలు, యువకుల కోలాహలం, రంగులు చల్లుకుంటూ, భజనలు చేస్తూ సమీపంలోని చెరువులు, కాలువల్లో నిమజ్జనం చేశారు. నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఆలూరు రూరల్: నిమజ్జనానికి వెళ్తున్న కోయనగర్ కాలనీ గణనాథుడు



హాలహర్వి: నిట్రవట్టి నుంచి గణనాథులను నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం



దేవనకొండలో ఏర్పాటు చేసిన కేరళ నృత్యం

- ఘనంగా గణేష్ నిమజ్జనోత్సవం
- ఊరేగింపుగా తరలిన విగ్రహాలు
- నిమజ్జనోత్సవంలో యువత కోలాహలం
- పోటాపోటీగా లడ్డూ వేలం



హొళగుంద: ఊరేగింపులో పాల్గొన్న జనం



తుగ్గలి: పత్తికొండలో విగ్రహాల శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం



దేవనకొండలో నిమజ్జనానికి తరలిన గణనాథుడు

ఆలూరు: పట్టణంలో వినాయక చవితి వేడుకలు ముగిశాయి. సోమవారం ఉదయం పలు మండపాల వద్ద కలర్ టీవీ, పట్టువస్త్రాలు, సైకిల్, బీరువా, మిక్సీలు, పది గ్రాముల వెండివస్తువులు, సెల్‌ఫోన్ తదితర వాటిని లక్కీ డ్రా తీసి విజేతలకు అందజేశారు.

పత్తికొండ/తుగ్గలి : పత్తికొండ, తుగ్గలి మండలాల్లో మూడురోజుల పాటు భక్తులచే విశేష పూజలందుకున్న గణనాథుడిని సోమవారం భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఉట్టుకొట్టి, లడ్డు, పూజా సామగ్రిని వేలం వేశారు. పత్తికొండ పట్టణంలో వీరభద్రేశ్వర దుకాణం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో స్వామి లడ్డూను రూ.1.2 లక్షలకు ప్రసాద్‌గౌడ్, రూలర్స్ యూత్ వద్ద హోసూరు సుజాత రూ.80 వేలు, మన గ్రోమోర్ వద్ద బుల్స్‌అండ్ ఈగల్స్ హోసూరు మల్లికార్జున (ఎంఎల్) రూ.76వేలకు, తుగ్గలి మండలం పగిడిరాయిలో అంకాలమ్మ గుడి వద్ద అనుమన్న రూ.80 వేలు, కొండయ్య బజారులో కావలి రంగయ్య రూ.70 వేలు, బోడబండ గేరిలో తిమ్మప్ప రూ.57,500కు వేలంలో పాడి దక్కించుకున్నారు.

వెల్దుర్తి: గోవర్ధనగిరి గ్రామంలోని వినాయక లడ్డూ ప్రసాదం ఎప్పటి కంటే అధిక ధర పలికింది. పోటాపోటీగా జరిగిన వేలాల్లో గుండం బయలులో కొలువైన గణనాథుని లడ్డూను గ్రామానికే చెందిన సిపాయి రాజు రూ.1.10లక్షలకు దక్కించుకున్నాడు. తెలుగు వీధిలో పెద్దమద్ది గోరంట్ల రూ.98 వేలకు దక్కించుకున్నాడు.



ఆస్పరిలో నిమజ్జనానికి తరలిన వినాయకుడి విగ్రహాలు



హొళగుంద: అయోధ్య ఆలయం గణపతిని తరలిస్తున్న దృశ్యం



హొళగుంద: ఊరేగింపు ముందు ఉత్సాహంగా డ్రమ్స్ కొడ్తున్న చిన్నారి



పత్తికొండలో హోమాలు నిర్వహిస్తున్న కేరళ వేద పండితులు



నంచర్లలో భారీ వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం



హొళగుందలో వినాయక విగ్రహాల ఊరేగింపు దృశ్యం

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

దేవనకొండ: కురుస్తున్న అధిక వర్షాల వల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని, ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా నాయకుడు బి.వీరశేఖర్, మండల కమిటీ సభ్యులు అశోక్, యూసుఫ్ భాషా డిమాండ్ చేశారు. సోమవారం వారు స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 15 రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. పత్తి పంటకు భారీగా నష్టం వాటిల్లిందన్నారు. ఖరీఫ్ మొదట్లో సాగు చేసిన పత్తి పంట పూత, కాయ దశలో ఉండగా ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తుండటంతో పూత, కాయ మొత్తం రాలిపోయిందన్నారు. అలాగే..టమాట, మిరప, వేరుశనగ పంటలు కుళ్లిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

కూలిన మట్టిమిద్దె

వెల్దుర్తి: ఎడతెరిపి లేని వర్షాలకు మట్టిమిద్దెలు కూలుతున్నాయి. సోమవారం అల్లుగుండులో హనీఫ్‌కు చెందిన మట్టిమిద్దె కూలింది. ఈ సమయంలో ఇంట్లో వారు బయటకు పరుగులు తీయడంతో ప్రాణనష్టం తప్పింది. వంట సామగ్రి, నిత్యావసర సరుకులు, వస్తువుల దాదాపు రూ.లక్ష మేర నష్టం సంభవించినట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

ఆవులను సంరక్షణ కేంద్రాలకు తరలించాలి

దేవనకొండ: మండల కేంద్రంలో ప్రధాన రహదారులపై సంచరిస్తున్న ఆవులను సంరక్షణ కేంద్రాలకు తరలించాలని ఏఐవైఎఫ్ మండలాధ్యక్షుడు రవికుమార్, ఏఐఎస్ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి భాస్కర్ కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ పశువులు రోడ్లపైకి వస్తుండడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

కరువు మండలాల్లో చేర్చాలి

హొళగుంద: అనావృష్టి, అతివృష్టితో పంటలు కోల్పోయిన రైతులను ఆదుకోవడంలో అధికారులు తుంగభద్ర దిగువ కాలువను సాకుగా చూపి కరువు మండలంగా ప్రకటించకుండా ఉండొద్ద ని రైతు సంఘం నాయకులు, చిదానంద కోరారు. సోమవారం ఆయన ఏఓ ఆనంద్ లోకదళ్‌తో కలిసి మండల పరిధి లో దెబ్బతిన్న మిరప, పత్తి తదితర పంటలను పరిశీలించారు. రైతులు ఎల్లెల్సీ కింద 0.05 శాతం కూ డా పంటలు సాగు చేయలేదన్నారు. రైతుసంఘం నాయకులు సింధువాలం కృష్ణయ్య, ఎర్రిస్వామి, దుర్గప్ప, పంపాపతి పాల్గొన్నారు.

ముంపు బాధితులకు నిత్యావసరాలు

పత్తికొండ(తుగ్గలి) : విజయవాడ వరద ముంపు బాధితుల సహాయార్థం నిత్యావసర సరుకులు అందించేందుకు టైలర్స్ అసోసియేషన్, ప్రభాస్ అభిమానులు ముందు కొచ్చారు. బియ్యం, మంచినూనె ప్యాకెట్లు, వస్త్రాలను సేకరించి సోమవారం సీపీఐ నాయకులకు అందజేశారు. ముంపు బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, తమ వంతు సాయం అందజేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య పిలుపునిచ్చారు.

కేసు నమోదు

తుగ్గలి: మండలంలోని చెన్నంపల్లి-పగిడిరాయి గ్రామాల మధ్య రెండు రోజుల క్రితం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ మార్గంలో వెళ్తున్న ఆల్విన్ లారీని తనిఖీ చేయగా వాటిలో రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించి వాహనాన్ని జొన్నగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వాహనంలో 259 సంచుల రేషన్ బియ్యం, వాహనంతో పాటు కారు స్వాధీనం చేసుకుని గుత్తికి చెందిన ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు జొన్నగిరి పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు సోమవారం పేర్కొన్నారు.

దోమల నివారణకు..



ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

హాలహర్వి: మండలంలోని గూళ్యం గ్రామంలో సోమవారం రాత్రి సర్పంచ్ ఉలిగమ్మ ఆధ్వర్యంలో దోమల నివారణకు పంచాయతీ సిబ్బందితో ఫాగింగ్ చేయించారు. ఆమె మాట్లాడుతూ ప్రజలు దోమకాటుకు గురికాకుండా రాత్రివేళల్లో దోమతెరలను వాడాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

వెల్దుర్తి: ఆటోతో జీవనం సాగిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త శివరామిరెడ్డి (40) సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. తెల్లవారుజామున ఇంట్లో బాత్‌రూమ్‌కు వెళ్లిన ఆయన అక్కడే కుప్పకూలాడు. గుర్తించిన భార్య హరిత, చుట్టుపక్కల వారి సహాయంతో ఆసుపత్రికి తరలించే ప్రయత్నించేలోపు మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి సంతాపం వ్యక్తం చేశాడు. మండల నాయకులు, కార్యకర్తలు, ఆటో యూనియన్ నాయకులు నివాళులర్పించారు.

'సూర్యఘర్'తో వెలుగులు

- సోలార్ పద్ధతిలో ఇంటిపైనే విద్యుదుత్పత్తి
- పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన అమలు
- రూ.30 వేల సబ్సిడీతో రుణ సదుపాయం
- ఆలూరు సబ్ డివిజన్‌లో 58,189 గృహ విద్యుత్ కనెక్షన్లు



ఇంటిపై ఏర్పాటు చేసి సోలార్ ప్యానల్

సోలార్ రూఫ్ రాయితీ వివరాలు

సామర్థ్యం	ఖర్చు రూ.	రాయితీ రూ.
కిలో వాట్	60 వేలు	30 వేలు
2 కిలో వాట్లు	1.20 లక్షలు	60 వేలు
3 కిలో వాట్లు	1.80 లక్షలు	78 వేలు

ఆలూరు రూరల్: నీరు, బొగ్గుతో విద్యుత్ తయారు చేస్తున్నా.. సరిపడినంతగా ఉత్పత్తి చేయలేకపోతుండటం, జలాశయాల్లోని నీరు సాధారణ అవసరాలకే సరిపడకపోవడం, బొగ్గు నిల్వలు తరిగిపోతుండటంతో భవిష్యత్ అవసరాలకు ప్రత్యామ్నాయ మార్గాలను చూపేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సహజ వనరులైన గాలి, సూర్యరశ్మి ఆధారంగా విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తోంది. సాధారణ గృహాలకు కూడా సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసేలా సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. ఇంటిపైనే సూర్యరశ్మి ద్వారా విద్యుదుత్పత్తి చేసుకునేలా, ఇందుకు అవసరమైన మేరకు రాయితీ అందిస్తూ గృహ వినియోగదారులను ప్రోత్సహిస్తోంది. ఆలూరు విద్యుత్ సబ్ డివిజన్‌లో 58,189 గృహ వినియోగదారులు ఉన్నట్లు విద్యుత్ శాఖ అధికారులు వెల్లడించారు.

రూ.30 వేల సబ్సిడీతో రుణ సదుపాయం..

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ పథకం మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. వంద చదరపు అడుగుల స్థలంలో 120 యూనిట్ల ఉత్పత్తి చేసే ఒక కిలో వాట్ సామర్థ్యం గల రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవచ్చు. దీనికి సుమారు రూ.60 వేలు ఖర్చు అవుతుంది. ఇందులో రూ.30వేలు కేంద్ర ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. మిగిలిన మొత్తాన్ని వినియోగదారులు బ్యాంకు నుంచి రుణం తీసుకునే వెసులుబాటు కల్పించింది.

విద్యుత్ వినియోగం ఆధారంగా..

విద్యుత్ వినియోగం 300 యూనిట్లలోపు ఉండాలనే నిబంధన ఉంది. కిలో వాట్‌కు నిర్ణయించిన మేరకు రూ.30 వేల ప్రకారం సబ్సిడీ ఇస్తారు. మిగిలిన మొత్తాన్ని బ్యాంకు నుంచి రుణం పొందవచ్చు. ఇంటి పై కప్పుపై వంద చదరపు అడుగుల స్థలంలో సోలార్ ప్యానల్స్, ప్రస్తుతం వాడే మీటర్ స్థానంలో నెట్ మీటర్ ఏర్పాటు చేస్తారు. దీని ద్వారా సోలార్ ఉత్పత్తి, వినియోగదారులు వాడుతున్న విద్యుత్‌ను లెక్కించే అవకాశం ఉంటుందని, వినియోగదారులు పెట్టిన పెట్టుబడి ఆరు నుంచి ఏడేళ్లలో తిరిగి పొందగలరని సోలార్ కంపెనీలు వెల్లడిస్తున్నాయి.

నెల రోజుల్లో సబ్సిడీ..

నెట్ మీటరు అమర్చిన తరువాత పోర్టల్‌లో బ్యాంకు ఖాతా వివరాలు అప్‌లోడ్ చేస్తారు. దీంతో సబ్సిడీ మొత్తాన్ని ప్రభుత్వం 30 రోజుల్లో చెల్లిస్తుంది. ఒక కిలో వాట్ రూఫ్ టాప్ కెపాసిటీ కోసం 3-4 ప్యానల్స్ (ఒక మీటరు వెడల్పు, 1.6 మీటర్ల ఎత్తు) లో అమర్చుతారు. కిలో వాట్ సోలార్ రూటర్ ప్యానల్ నెలకు దాదాపు 125కు పైగా యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుంది. అలాగే..సోలార్ రూఫ్ టాప్ సూర్యడి వేడిని పీల్చుకోవడం వల్ల ఇల్లు కూడా చల్లగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

నమోదు ఇలా..

సోలార్ ప్యానల్ కోసం ముందుగా ఫోన్‌లోని గూగుల్ ప్లే స్టోర్‌కి వెళ్లి పీఎం సూర్య ఘర్ యాప్ డౌన్ లోడ్ చేసుకోవాలి. ఇంటి విద్యుత్ సర్వీస్ నంబర్ నమోదు చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ కోసం రూ.1,190 చెల్లించాల్సి ఉంటుంది. ఆరు నెలల కరెంటు బిల్లు కాపీలు విద్యుత్ శాఖ అధికారులకు ఇవ్వాల్సి ఉంటుంది. యాప్‌లో నమోదు చేసిన వివరాలు సంబంధిత విద్యుత్ శాఖకు వెళ్తాయి. వారు ఇంటికొచ్చి సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేస్తారు. దీనికి మీటరు అమరుస్తారు. ఒక కిలో వాట్ ప్యానల్ అమర్చుకుంటే రూ.30 వేలు ఖర్చు అవుతుంది.

ప్రజలకు అవగాహన కల్పిస్తాం



సూర్యఘర్ పథకం ద్వారా వినియోగదారులే సోలార్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకోవచ్చు.సోలార్ విద్యుత్ ప్యాన ల్ ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. రుణ సదుపాయం కల్పిస్తుంది.నెట్ మీటర్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి వాడకం తెలుసుకోవచ్చు. సందేహాలు ఉంటే విద్యుత్ అధికారుల ద్వారా నివృతి చేసుకోవచ్చు.ఈ పథకం పై ప్రజలకు అవగాహన కల్పిస్తాం.

– గురప్ప,ఏఈ,ఆలూరు